క్లుప్తంగా

బీసీ సబ్‌కమిటీ ఏర్పాటుపై హర్షం

నాగోలు: కులవృత్తుల అభివృద్ధికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు బీసీ సబ్‌కమిటీని ఏర్పాటు చేసేందుకు సీఎం నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రాష్ట్ర చేతివృత్తి సంఘాల రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారి సంఖ్య లక్షల్లో ఉందన్నారు. వారికి రూ. లక్ష కాకుండా కనీసం ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసారు.

నాగోలుకు నూతన సీఐ


వెంకటేశ్వర్లు

నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో నాగోలులో నూతనంగా ఏర్పాటు చేయనున్న నాగోలు పోలీస్ స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా సి.వెంకటేశ్వర్లును నియమిస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు నాగోలు కొత్త పోలీస్ స్టేషన్‌కు కేటాయించారు. 2007లో ఎస్‌ఐగా చేరిన ఆయన నగరంలో వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. నాగోలు పోలీస్ స్టేషన్ జూన్ 2న ప్రారంభించే అవకాశముందన్నారు. బండ్లగూడ ప్రాంతంలో నూతన పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు పరిశీలిస్తున్నారు.

సెంట్రింగ్ కార్మికుల సంక్షేమమే యూనియన్ ప్రధాన లక్ష్యం

చంపాపేట: సెంట్రింగ్ కార్మికుల సంక్షేమమే యూనియన్ ప్రధాన లక్ష్యమని చంపాపేట డివిజన్ సెంట్రింగ్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు దయానంద్ స్పష్టం చేశారు. ఆదివారం చంపాపేటలోని తమ కార్యాలయంలో యూనియన్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అమరేందర్ సాగర్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వామిగౌడ్ సేవలు మరువలేనివి


స్వామిగౌడ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మన్సూరాబాద్: బీజేపీ ఎల్‌బీనగర్ సీనియర్ నాయకుడు సీహెచ్ స్వామిగౌడ్ వర్ధంతిని ఎల్‌బీనగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన స్వామిగౌడ్ చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌బీనగర్‌లో బీజేపీ పటిష్టతకు స్వామిగౌడ్ ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాచమల్ల విజయ్ భాస్కర్, పల్లే గణేష్‌గౌడ్, గుండే కిరణ్‌కుమార్, ఆకుల పవన్, చెదురుపల్లి శివాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఉండి.. అనాథలా వృద్ధురాలి మృతి

- మూడు రోజుల అనంతరం విషయం బయటకు..
- జీహెచ్‌ఎంసీ అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా వచ్చిన బంధువులు

అంబర్‌పేట: అందరూ ఉండి ఓ వృద్ధురాలు అనాథలా మృతి చెందింది. మృతి చెందిన రెండు రోజులకు విషయం వెలుగులోకి రావడంతో జీహెచ్‌ఎంసీ దహన సంస్కారాలకు ఏర్పాటు చేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న బంధువులు వచ్చి స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో వృద్ధురాలి అంతిమ సంస్కారాలు పూర్తి చేసినట్టు సమాచారం. ఈ ఘటన ఆదివారం అంబర్‌పేట డివిజన్‌లో వెలుగులోకి వచ్చింది. స్థానికులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది కథనం ప్రకారం. అంబర్‌పేట డివిజన్ సునార్‌బౌలిలో పార్వ నర్సమ్మ (80) తన కుమారుడితో కలిసి ఉంటుండగా.. కుమారుడు తాగుడుకు బానిస అయ్యాడు. కాగా నర్సమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతి చెందినట్లు శనివారం వెలుగులోకి రావడంతో అంత్యక్రియలకు సందిగ్ధం నెలకొంది. దీంతో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ, పోలీస్ విభాగాలకు సమాచారం ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ ఆదివారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా.. సమాచారం అందుకున్న బంధువులు వచ్చి ఆమె దహనసంస్కారాలు పూర్తి చేశారు. కాగా మృతురాలి కాలికి ఉన్న మూడు వేళ్లు లేకపోవడంతో ఎలుకలు కొద్ది మేరకు కొరికి తిన్నట్లు జీహెచ్‌ఎంసీ సిబ్బంది అనుమానిస్తున్నారు. ఎట్టకేలకు బంధువులు, స్థానికులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది అంతా కలిసి ఆదివారం మధ్యాహ్నం ఆమెను అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

మూడు రోజులుగా మురుగు సమస్య


బండ్లగూడ చౌరస్తాలో రోడ్డు మీద పారుతున్న మురుగు నీరు



నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ చౌరస్తాలో మూడు రోజుల నుంచి డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు పెద్ద ఎత్తున రోడ్డు మీద పారడంతో దుర్వాసనతో కాలనీ వాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బండ్లగూడ ప్రధాన రహదారి వెంట రెండు కిలోమీటర్ల మేరకు డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. బండ్లగూడ గ్రామం నుంచి విజయ్ గార్డెన్, శ్రీనివాస్‌నగర్ వరకు డ్రైనేజీ నీరు రావడంతో స్థానికంగా ఉండే షాపుల నిర్వాహకులు, కాలనీ వాసులు డ్రైనేజీ దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై స్థానికులు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌బీనగర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ అభివృద్ధి విషయంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కు తగ్గేది లేదని..నియోజకవర్గాన్ని రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దటమే తన ముందున్న అంతిమ లక్ష్యమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చంపాపేట డివిజన్ పరిధిలోని పవన్‌పురి, ఎంఆర్‌ఆర్, ఉదయ్‌నగర్, సూర్యానగర్ కాలనీలలో ప్రారంభించిన వరదనీటి కాలవ పనులను ఆయన సర్కిల్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఉదయ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎల్‌బీనగర్ పరిధిలోని పలు డివిజన్లలో ప్రారంభించిన వరదనీటి కాలవ పనులు 75 శాతం పూర్తి అయ్యాయని అన్నారు. ప్రతీ ఏటా వర్షాకాలంలో వచ్చే వరద ముంపును అంచనా వేసి భవిష్యత్తు తరాలకు ఆసమస్య పునరావృతం కాకుండా పక్కా ప్రణాళికతో వరదనీటి కాలువల ఏర్పాటుకు రూపకల్పన చేశామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లా రఘుమారెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, సుంకోజు కృష్ణమాచారి పాల్గొన్నారు.


వరదనీటి కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

షాదీముబారక్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారుకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరం అని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని కార్యాలయంలో ఆదివారం చార్మినార్ మండలానికి చెందిన 21 మందికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఫర్హత్‌నగర్, ఉస్మాన్‌పుర, కట్టెలగూడ, చంచల్‌గూడ, షాహకాలనీలకు చెందిన లబ్దిదారులకు అందజేసిన చెక్కుల విలువ రూ.21,02,436 ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల ఆర్‌ఐలు యూనస్, సాయికిరణ్, మజ్లిస్ నాయకులు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: వీరన్నగుట్ట బస్తీలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్ట బస్తీలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేపట్టిన బస్తీ నిద్ర కార్యక్రమంలో ఆదివారం ఉదయం ముగిసింది. బస్తీ సమస్యలతో పాటు సమీప కాలనీవాసుల సమస్యలను ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దు


పర్యావరణ జీవనశైలిపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: బహిరంగ ప్రదేశాలలో, రహదారులపై చెత్తవేయవద్దని.. ప్రతి ఒక్కరూ విధిగా చెత్తను స్వచ్ఛ ఆటోలలోనే వేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. ఆదివారం హస్తినాపురంలోని జిల్లా పరిషత్ రోడ్డులో ఏర్పాటు చేసిన పర్యావరణ జీవన శైలిపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్, శానిటరి ఇన్‌స్పెక్టర్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ మెద్దు లచ్చిరెడ్డి

చంపాపేట: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు చేపట్టాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మెద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు.ఆదివారం ఆయన ఎస్‌కేడీ నగర్ కాలనీలో పర్యటించి సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఫుట్‌పాత్ ఏర్పాటు చేయటంవల్ల రహదారి ఇరుకుగా మారుతుందని అందువల్ల కాలిబాటను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సిన అవసరంలేదని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు వెంకటరెడ్డి, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

కేంద్రం విధానాలతో ఎంతో నష్టం


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాయకులు

హస్తినాపురం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ఎంతో నష్టం జరుగుతోందని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని అన్ని రంగాలలో పనిచేసే కార్మికులకు ప్రస్తుతం కేంద్రం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నందనవనం కాలనీలో ఆలేట ఎల్లయ్య అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలల్లో బీజేపీ ప్రభుత్వానికి ఓటమి తప్పదనే భయంతో కార్మికుల ఐక్యతను పక్కదారి పట్టించేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న మదన్ మోహన్‌రెడ్డి, ఇతర సభ్యులు

జిల్లా అధ్యక్షుడిగా మదన్ మోహన్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: రోలర్ స్కేటింగ్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా సూరకంటి మదన్ మోహన్ రెడ్డి ఎన్నికయాయరు. ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో 2023–27 వరకు ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకున్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా టంగుటూరి నాగరాజు, ఉపాధ్యక్షులుగా రవి, ఎడ్ల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా సత్తయ్య, జాయింట్ సెక్రటరీలుగా మహేందర్‌రెడ్డి, నవీన్‌కుమార్, నరేశ్, కోశాధికారిగా వట్టి శ్రీను, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా వి.రాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, లింగస్వామి, సూర్యప్రకాశ్, శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రోలర్ స్కేటింగ్ క్రీడ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కమిటీ ఎన్నికల అధికారిగా ధారావత్‌రవి, పరిశీలకులుగా ఎం.రవికుమార్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కె.యాదయ్య, ఎం.కృష్ణమూర్తిలు వ్యవహరించారు.

2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

మీర్‌పేట: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూన్ 2న నిర్వహించే ఈ క్విజ్ పోటీలకు సంబంధించి పోస్టర్లను ఆదివారం మీర్‌పేట మంద మల్లమ్మ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఇన్‌చార్జి నయీం సద్దాం ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు 16 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు 766 189 9899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇస్తే మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింక్ వస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమ అంశాలపై 60 ప్రశ్నలకు 60 నిమిషాల నిడివి ఉంటుందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లను అందజేస్తామన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 మందికి ప్రోత్సాహక బహుమతి కింద స్మార్ట్‌వాచ్‌లు, ఇయర్‌ప్యాడ్‌లు, హార్డ్‌డ్రైవ్‌లు, పవర్‌బ్యాంక్‌లను ఇస్తామన్నారు. ప్రతీ అసెంబ్లీ పరిధిలో ఒక మహిళకు ఎలక్ట్రిక్ స్కూటీని బహుమతిగా అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పెండెం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్, కార్యదర్శి అమీర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల అధ్యక్షులు దీక్షిత్, నందకిషోర్, కౌశిక్, సొహెల్ పాల్గొన్నారు.

కలుషితనీటి సరఫరాను అరికట్టాలి



అబిడ్స్: కొన్ని రోజులుగా అల్లాబండ సెక్షన్ ప్రాంతంలోని ఇందిరానగర్ బస్తీలో కలుషిత నీటి సరఫరా అవుతున్నా వాటర్‌బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా ఇందిరానగర్ బస్తీలో కలుషిత నీటి సరఫరా అవుతుండడంతో స్థానికులు అనారోగ్యాలు గురవుతున్నారు. వాటర్‌బోర్డు జీఎం, డీజీఎం, జీఎంల దృష్టికి కలుషిత నీటి సరఫరా నివారించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. అల్లాబండ సెక్షన్ మేనేజర్‌కు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయకగా ఆయన స్పందించకపోవడంతో డీజీఎం, జీఎంలకు కూడా ఫిర్యాదు చేసినా కలుషిత నీటి సరఫరా అలాగే కొనసాగుతుందన్నారు. వెంటనే మరమ్మతులు చేసి కలుషిత నీటి సరఫరాను అరికట్టకుంటే వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇందిరానగర్ ప్రాంతంలో ఇంటి నెంబర్:13-1-1236 పరిసర ప్రాంత ఇళ్లల్లో ప్రతిరోజూ కలుషిత నీటి సరఫరా అవుతుందనివారు వాపోయారు.

డ్రైనేజీ సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి


డ్రైనేజ్ లైన్ పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్

నాగోలు: కాలనీ ప్రజలకు డ్రైనేజీ ఇబ్బందులు రాకుండా జలమండలి అధికారులు పనిచేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ మారుతినగర్ జైన్ మందిర్ వెనకాల డ్రైనేజ్ లైన్ నుండి మురికి నీరు నిరంతరం పొంగుతోందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆదివారం కాలనీలో పర్యటించారు.అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కార్పొరేటర్ పవన్ కుమార్ అక్కడికి వెళ్లి డ్రైనేజ్ సమస్యని పరిశీలించారు. కాలనీ ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్య మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో మంచి రాజేష్, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో యువకుల చేరిక


మల్‌రెడ్డి రాంరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులు

చైతన్యపురి: చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రణధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైతన్యపురిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆపార్టీ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. కర్ణాటకలో ఎన్నికల సమయంలో ఇచ్చి ఐదు హామీలను ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే వాటి అమలుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉత్వర్వులు జారీ చేశారని అన్నారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దళిత బంధులో తమకు అన్యాయం చేశారని, తన అనుచరులకు డబ్బులు ఇచ్చిన వారికి దళితబంధు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మతిన్. షరీఫ్, మాతంగి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అసమర్థ పాలన వల్లే ప్రజాసమస్యలు


హస్తినాపురంలో పర్యటిస్తున్న బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

హస్తినాపురం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అసమర్థ పాలన వల్లే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వరద ముంపు ప్రాంతాలైన శ్రీరమకాలనీ, భీమానగర్, బాలాజీనగర్, వందనాపురికాలనీ, గ్రీన్‌ల్యాండ్స్ కాలనీలలో స్థానికులతో కలిసి అసంపూర్తిగా నిలిచిపోయిన నాలాపనులను పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిలిచి పోయిన నాలా పనులను అధికారులు పూర్తిచేయాలన్నారు. వరద ముంపు ప్రాంతాలలో రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన బాక్స్ డ్రైన్ పనులను కేవలం జెడ్‌పీ రోడ్డు నుండి వంనపురి కాలనీ వరకు కేవలం 500 మీటర్ల వరకే పరిమితం అయ్యిందని అన్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి అధికారులకు ఫోన్ చేసి ప్రశ్నించారు. కార్యక్రమంలో గౌని వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి


ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో నివాళులర్పిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి


ఎన్టీఆర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి, గణేష్

దిల్‌సుఖ్‌నగర్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం మలక్‌పేట్‌జోన్ పరిధిలోని డివిజన్‌లు, కాలనీలలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి దేశానికి రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కేపురంలో..

ఆర్‌కెపురం డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లో మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఐటీని దేశానికి పరిచయం చేసిన మొట్టమొదటి ప్రధానమంత్రి అని ఆయన కొనియాడారు. పార్టీ నాయకులు మధుసూధన్‌రావు, చిలుక ఉపేందర్‌రెడ్డి, నాయకులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్, పున్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్: టీపీసీసీ డెలిగేట్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. భాస్కర్‌యాదవ్, ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్, రాజీవ్ గాంధీ చౌరస్తా, వాసవి కాలనీలలో మాజీ ప్రధాని రాజీవ్-గాంధీ వర్ధంతి వేడుకలు ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావ్ పాల్గొని రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గట్ల రవీంద్ర, తలాటి రమేష్ నేత తదితరులు పాల్గొన్నారు.